తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## చల్లంగా చూడమ్మా గంగమ్మా
### చెరకుగడల అలంకరణతో గంగమ్మ దర్శనం



తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత మూడవ మంగళవారం ఆలయం ఆవరణం చెరకుగడల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం పూర్తిగా, గంగమ్మను చెరకుగడలతో అలంకరించారు. అర్చకులు అమ్మవారికి కర్పూర హారతులిచ్చి నివేదనలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, సభ్యులు, ఆలయ ఈఓ ఎ.జయకుమార్ స్వయంగా భక్తులకు దర్శనం చేయించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

## కల్యాణ శ్రీనివాసుడికి రూ.33 లక్షల విలువైన స్వర్ణాభరణాలు



తిరుమల, జూన్ 2ప్రభాతవార్తప్రతినిధి: స్థానిక ఆలయాల బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి ఆభరణాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామికి తిరుమల శ్రీవారి ఆలయం నుండి 33 లక్షల రూపాయలు విలువైన స్వర్ణాభరణాలను బహుకరించారు. ఈ ఆభరణాలలో శీమ కమలాలు, నవరత్న పూసలతో కూడిన రెండు పేటల బంగారు హారం, బంగారు లక్ష్మీ కాసుల మాల ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆలయం తరఫున ఆలయ డిప్యూటీ ఈఓ ఎం.లోకనాథం ఈ ఆభరణాలను నారాయణవనం ఆలయ డిప్యూటీ ఈఓనాగరత్నకు అందజేశారు.

## దక్షిణామూర్తికి భక్తిశ్రద్ధలతో 'గురుపేర్చి' అభిషేకాలు





దక్షిణామూర్తి ఆలయం వద్ద గురుపేర్చి సందర్బంగా హాజరైన భక్తులు అధికారులు నాయకులు, హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు వేదపండితులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద గురుపేర్చి సందర్భంగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి చోటు చేసుకుంది. ఏడాదిలో ఒక సారి గురుగ్రహం రాశి మారే సమయంలో నిర్వహించే ప్రత్యేక పూజలను ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొన్ని తమిళ సంప్రదాయాలను ఆచరించటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆలయానికి చెందిన ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో సుమారు 25 సంవత్సరాలుగా 'గురు సంక్రమణ హోమాలు, అభిషేకాలు' గురు పేర్చి పేరుతో నిర్వహిస్తున్నారు. గురువు మిధునరాశి నుంచి కర్కాటక రాశిలోకి మారినసందర్భంగా భక్తి శ్రద్ధలతో అష్టోత్తర శత శంఖాభిషేకాలు,పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్,పలురువు సభ్యులు, ఆలయ ఇఓ బికె వవెంకటేశులు, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిలు హాజరు కాగా ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు భారీ ఎత్తున స్వామి అభిషేకాలకు సుమారు వెయ్యి లీటర్లపాలను అందించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్ డాక్టర్ ఎస్ఎంకె స్వామి నాధన్ గురుకుల్ పర్యవేక్షణలో గురు సంక్రమణ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

**గురుగ్రహం రాశిమారిన సమయాన:**
నవగ్రహాల్లో పంచమ గ్రహమైన గురు గ్రహం,మీన రాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించు శుభ సమయాన దక్షిణామూర్తి ఆలయం వద్ద కలశ స్థాపన, హోమాలను ఏర్పాటు చేసారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా పౌరోహితులు అర్ధగిరి స్వామి దిశ దెశ నిర్దేశం చేస్తుండగా స్వామినాధన్ పూజలను నిర్వహించారు. ఇక ఇక్కడ 108 శంఖాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కరుణాకర్ గురుకుల, సంబంధం గురుకుల్ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిలచే సంకల్పం చేయించారు. పాలతోనూ వివిధ సుగంధ ద్రవ్యాలతో దక్షిణామూర్తికి అభిషేకించారు. అభిషేకాలను అర్చకులు కరుణాకర్,సూరి,నిరంజన్ శ్రీనివాసులు నిర్వహించారు. నైవేద్యం, దీపారాధన, మంత్రపుష్పం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అభిషేకాలతో దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఆదేశాలతో ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు చక్కటి ఏర్పాట్లు చేసారు. పూజా టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి ఆ కరుణాకర్ గురుకుల్ ప్రసాదాల సంచులను దక్షిణామూర్తి డాలర్లను అందించారు.

## ప్రాణం తీసిన ఈత సరదా
### యువకుడు గల్లంతు



బండారు ముని( ఫైల్‌ఫోటో)

కార్వేటినగరం,జూన్ 2 ప్రభాతవార్త: ఈత సరదా ప్రాణం తీసింది. వేసవి తాపం తట్టుకోలేక ముగ్గురు యువకులు చెరువులో ఈతకు వెళ్లారు. ఓ యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసు కుంది. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వినాయకపురం రోడ్డు,ముద్దుకృష్ణాపురంకు చెందిన చింటూ,మధు,ముని(17)మంగళవారం మధ్యాహ్నం ఈత సరదాకోసం నందిమంగళం కొత్త చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్ళారు. వీరిలో మునికి ఈత రాకపోవడంతో చెరువులోకి దిగిన కొద్దిసేపటికే నీటిలో గల్లంతైనట్లు సమాచారం. అయితే కూడా వెళ్ళిన చింటూ, మధు చెరువు వద్ద జరిగిన విషయాన్ని వెంటనే కుటుంబసభ్యులకు తెలియజేయకుండా తిరిగి గ్రామానికి వచ్చేసినట్లు సమాచారం. చీకటి పడుతున్నా ముని ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరా తీయగా చెరువులో గల్లంతయిన విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తుంది. పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ కానరానట్లు తెలుస్తుంది. ముద్దుకృష్ణాపురంకు చెందిన బి.మాధవి, బి.మునీంద్రా దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. గల్లంతైన బండారు ముని 8వ తరగతి వరకు చదువుకున్నాడు. చదువు అర్థాంతరంగా ఆపి వేసి పుత్తూరు పట్టణంలోని ఓ నూనె వ్యాపారి దగ్గర డెలివరీబాయిగా జీవనం సాగిస్తున్నారు. ఏడాది క్రితం తండ్రి బండారు మునీంద్ర అనారోగ్యంతో మృతిచెందాడు.తల్లి మాధవి ఓ వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుంది.ఎంత గాలించినా బండారు ముని ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబసభ్యులు,బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. కార్వేటినగరం ఎస్.ఐ.తేజస్విని, పోలీసులబృందం గాలింపు చర్యలు చేపట్టారు.

## నవచేతన ఎఐ యాప్‌పై విస్తృతంగా అవగాహన : కలెక్టర్



చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త: నవచేతన ఎఐ యాప్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశభవనంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నారుల సమగ్రాభివృద్ధి, ఆరోగ్య స్థితిని మరింత సమర్థవంతంగా అంచనా వేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత స్క్రీనింగ్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంను కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిడిపిఓలు, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని, 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో ఎదుగుదల లోపాలు, పోషకాహారస్థితి, అభివృద్ధి మైలురాళ్ళు, ఇతర ఆరోగ్య సంబంధిత సస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించే స్క్రీనింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రత్యేక యాప్‌తో పాటు ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు ఈ యాప్‌పై అవగాహన కలిగి వుండాలని, తల్లిదండ్రులకు సున్నితంగా ఈ విషయంను వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా నవచేతన అనే ప్రత్యేక ఎఐ యాప్ సహాయంతో పిల్లల ఆరోగ్య పరిస్థితిని విశ్లేషిస్తారని, ఇందులో ముఖ్యంగా 3 పద్దతుల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధిని అంచనా వేస్తారన్నారు. అలాగే యాప్ ద్వారా చిన్నారుల శారీరక, మానసిక స్థితిని నేరుగా పరిశీలించడం, తల్లిదండ్రులు, సంరక్షకులను అడిగే ప్రశ్నల ద్వారా సమాచారంను సేకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 9 దశల వర్గీకరణ చేసి 21 రకాల లోపాల గుర్తిస్తారని, ఈ కార్యక్రమం కోసం 0-6 సంవత్సరాల పిల్లలను 9 విభిన్న దశలుగా విభజించారని, వయస్సు ఆధారంగా యాప్‌లో స్వయం చాలకంగా ప్రశ్నావళి రూప కల్పన జరుగుతుందన్నారు.కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ బి.రాజేష్ కుమార్, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మార్కెట్‌ను శాసించిన మంగంపేట ముగ్గురాయి
## కనుమరుగు కానుందా..?



ఓబులవారిపల్లి, 2 జూన్ ప్రభాతవార్త

ఒకప్పుడు ఇప్పుడు ప్రపంచ మార్కెటు శాసించిన శాసించిన మంగంపేట ముగ్గరాయి ఇకపై కొన్ని సంవత్సరాలకు కనుమరుగు కానుందా. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకనగా 2023 .24 సంవత్సరాల లో పగలు రాత్రి తేడా లేకుండా ఉత్పత్తి అధికంగా తీసి టార్గెట్ నుంచి ఎగుమతులు చేయడం వల్ల పూర్తిగా ఏ గ్రేడ్ కనీసం. ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని సమాచారం ఈ నేపథ్యంలో బి గ్రేడ్ మరియు సిఎండి గ్రేడ్ కనిజాలు ఆశించిన మేరకు వచ్చిన ఇలా ఎక్స్పోర్ట్ చేయడం వల్ల ఎంతో కాలం బంగంపేటలో ముగ్గురాయి నిలువు ఉన్నదని తెలుస్తోంది ఇకపై ప్రపంచ మార్కెట్లో మంగంపేట ముగ్గురాయి ఏ గ్రేడ్ ఖనిజం కనిపించదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి అదే కాకుండా ఒక ఎక్స్పోర్ట్ కంపెనీకి అధికంగా రాయి సరఫరా చేసి ఏపీఎండిసి సమస్త అధికారులు నాయకులు పప్పం గడుపుకుంటున్నారని ఆరోపణలు విమర్శలు లేకపోలేదు ఎప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు అధికంగా రాయిని ఎక్స్పోర్ట్ చేయకుండా స్థానిక మిల్లర్లకు ఉపాధి కొరకు సరఫరా చేసి కొంతవరకైనా స్థానికులను జీవనోపాధి కల్పించి మంగంపేటలో నమ్ముకుని జీవిస్తున్న పలవరైజింగ్ మిల్లులయజమానులకు అక్కడ పనిచేసే వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు ఆర్థిక విశ్లేషకులు కార్మిక నాయకులు, అధికారులను కోరుతున్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : కడ పి.డి
### - ఏరియా ఆస్పత్రి..ప్రభుత్వ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు !!



కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం కడ పి.డి. కుప్పం ఏరియా ఆస్పత్రి, కుప్పంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అలాగే క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పరిశీలించారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో నేరుగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఎక్కువసమయం క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా టోకెన్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. అలాగే రోగులు, సహాయకులకోసం ప్రత్యేక నిరీక్షణ ప్రాంతం ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న టాటా సంజీవని సెంటర్‌ను పరిశీలించారు. అంతకుముందు కుప్పంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ప్రత్యేక డైనింగ్ హాలు ఏర్పాటు, వాష్‌రూంలలో కొత్త లైటింగ్ వసతి కల్పించాలని కోరగా అందుకు తగిన నిధుల మంజూరుకు పి.డి. హామీ ఇచ్చారు. మునస్వామిపురంలో ఉన్న బిసి, ఎస్సీ బాలుర హాస్టళ్లను సైతం తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని హెచ్‌పి రోడ్డులో జరుగుతున్న డ్రైనేజ్ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడరాదని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం గుడుపల్లె రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆఫీసర్స్ గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలించారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎఎస్‌డబ్ల్యుఓ మీనాక్షి, పిఆర్ డిఇ గురవారెడ్డి, మున్సిపల్ ఎఇ ఆంజనేయులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 2.12 కోట్లు ఆదాయం



కాణిపాకం, జూన్ 2 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 2,12 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. మంగళవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 25 రోజులకు గాను హుండీల ద్వారా 2,11,98,696 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 28 గ్రాముల బంగారు, 870 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 18,242 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 2,48,609 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 334 అమెరికా డాలర్లు,30 కెనడా డాలర్లు,12 పింగపూర్ డాలర్లు 150 యూఏఈ దినార్స్,53 మలేసియా రింగిట్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ,ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి,హరిమాధవరెడ్డి, దనపాల్, రవీంద్రబాబు,ధనుంజయ, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## షార్ డైరెక్టర్‌గా...ముత్తు చెళియన్



సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరి కోటనూతన డైరెక్టర్‌గా సీనియర్ శాస్త్రవేత్త,అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ ముత్తు చెళియన్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. షార్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈఎస్ పద్మ కుమార్ పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో డైరెక్టర్‌గా ముత్తు చెళియన్ నియమితులయ్యారు. 1967 జూలై 13న తమిళనాడులో జన్మించిన ముత్తు చెళియన్ 1991 ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇస్రోలో శాస్త్రవేత్తగా చేరారు. 30 సంవత్సరాలు ఇస్రో చేపట్టిన అనేక ప్రయోగాలలో భాగస్వామిగా ఉన్నారు.ఈ సందర్భంగా పదవి విరమణ చేసిన ఈఎస్ పద్మ కుమార్ నుఅభినందించి వీడ్కోలు పలికారు. నూతన డైరెక్టర్ ముత్తు చెళియన్ ను పలువురు షార్ శాస్త్రవేత్తలు అభినందించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ ముత్తు చెళియన్ మాట్లాడుతూ షార్ సెంటర్‌ను మరింతప్రగతి పధంలోకి తీసుకువెళ్లేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. అందుకు శ్రీహరికోటలోని ప్రతి ఒక్కరి సహకారం అవసరమని చెప్పారు.

## దుకాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 2 ప్రభాతవార్త :



అలిపిరి ప్రాంతంలో తాత్కాలిక దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన దుకాణదారులు మంగళవారం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి, న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తుంటారని, తిరుమలకు ప్రధాన ముఖద్వారమైన అలిపిరి ప్రాంతంలో భక్తుల రద్దీ ఎల్లప్పుడూ అధికంగా ఉంటుందని తెలిపారు. అలిపిరి ప్రాంతంలో రహదారి పక్కన పెద్ద ఎత్తున తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల భక్తుల రాకపోకలకు, వాహనాల సంచారానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల కారణంగా రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన వారిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

## ఎస్వీయూలో వ్యర్థాల నుంచి ఇంధనం..
### చెత్తే సంపద.. తిరుపతిలో జీరో రెసిడ్యూ టెక్నాలజీ పరీక్ష
### విజయవంతమైన పైలట్ ప్రయోగం
### వీసీ పర్యవేక్షణలో నిర్వహణ..
### జీరో రెసిడ్యూ సాంకేతికతపై అధికారుల ప్రశంసలు



తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త వ్యర్థాల నిర్వహణలో వినూత్న మార్పులకు దారితీసే రామ్‌చరణ్ పైరోలిసిస్ (ఆర్‌పీఆర్) సాంకేతికతపై నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విజయవంతంగా పూర్తయింది. మే 10 నుంచి 22 వరకు నిర్వహించిన ఈ ప్రయోగాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తాటా నరసింహారావు పర్యవేక్షించారు.ఆక్సిజన్ రహిత, పూర్తిగా మూసివేసిన రియాక్టర్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియలో వ్యర్థాలను ఎలాంటి దహనం లేకుండా ఉపయోగకర ఉత్పత్తులుగా మార్చారు. సాధారణ ఇన్సినరేషన్ విధానాల్లో ఉత్పత్తి అయ్యే పొగ, విషవాయువులు, డయాక్సిన్లు, భారీ లోహాల కాలుష్యాన్ని ఈ సాంకేతికత ద్వారా నివారించవచ్చని నిపుణులు తెలిపారు.తిరుపతిలో రోజువారీగా ఉత్పత్తి అయ్యే వివిధ రకాల వ్యర్థాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ పుష్ప వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, వంటింటి వ్యర్థాలు, చేపలు, రొయ్యలు, కోళ్ల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, పాత టైర్లు తదితర పది రకాల వ్యర్థాలపై ప్రయోగాలు నిర్వహించారు. ప్రతి ప్రయోగంలోనూ ద్రవ ఇంధనం, బయోఫ్యూయల్, ఎస్టర్లు, కార్బన్ బ్లాక్, యాక్టివేటెడ్ కార్బన్, ఎరువులు వంటి రెండు ఉపయోగకర ఉత్పత్తులు లభించగా, ఎలాంటి వ్యర్థ అవశేషాలు మిగలకపోవడం విశేషంగా నిలిచింది.వ్యర్థాలను ముందుగానే వేరు చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా ప్రాసెస్ చేయగలగడం ఈ సాంకేతికత ప్రత్యేకతగా పరిశోధకులు పేర్కొన్నారు.వేస్ట్ టు వెల్త్ భావనను ఆచరణలో చూపించే ఈ విధానం భవిష్యత్తులో పట్టణ వ్యర్థాల నిర్వహణకు సమర్థవంతమైన పరిష్కారంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రెక్టార్ అప్పారావు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి రవి పుల్లగూర, డాక్టర్ వరదరాజులు, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు, చెన్నైకి చెందిన ఎంటిటీ1 వాల్యూ ఎమిషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తుషార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నుంచి ఆర్థిక విలువ కలిగిన ఉత్పత్తులను తయారు చేసే ఈ సాంకేతికతను విస్తృత స్థాయిలో అమలు చేసే అవకాశాలపై సమావేశంలో చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రాల్లో టీచర్లకు మెరుగైన వసతులు

## - ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:



జిల్లాలో 11 కేంద్రాల్లో జూన్ 4 నుండి 9వ తేదీ వరకు 1, 2 తరగతులకు బోధించే టీచర్లకు సమగ్ర శిక్ష ద్వారా నిర్వహించనున్న శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు మెరుగైన వసతులు కల్పించాలని ఫ్యాప్టో నాయకులు సర్వశిక్షాభియాన్ జిల్లా అదనపు కో-ఆర్డినేటర్ ఎం.వెంకటరమణను మంగళవారం కలిసి కోరారు. ప్రస్తుతం వేసవి తీవ్రత దృష్ట్యా టీచర్లు శిక్షణ పొందు కేంద్రాలు నివాస కేంద్రాలకు దూర ప్రాంతాల్లో వుండటంతో ప్రయాణం చేయడానికి ఇబ్బందిగా వుందని, టీచర్ల నివాస ప్రాంతాలకు సమీపంలో వున్న శిక్షణా కేంద్రాల్లో ముందస్తుగా అనుమతి తీసుకుని హాజరయ్యే సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే నగరి డిడిజన్ పరిధిలో నగరిలోనే రెండు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారని, వీటిలో ఒక కేంద్రంను కార్వేటినగరంలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే శిక్షణా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు కావాల్సిన కనీస సౌకర్యాలు సమకూర్చాలని వారు కోరారు. సర్వశిక్షాభియాన్ కో-ఆర్డినేటర్‌ను కలిసిన ఫ్యాప్టో నాయకుల్లో ఎన్.మణిగండన్, జి.మునీర్ అహ్మద్, జివి రమణ, మదన్‌మోహన్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, ముక్తార్ అహ్మద్, చిట్టిబాబు తదితరులు వున్నారు.

## దగ్గు వున్న వారికి తప్పనిసరిగా కఫం నమూనాలు సేకరణ

### – డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్

చిత్తూరుహెల్త్, జూన్ 2 ప్రభాతవార్త:



రెండు వారాల పాటు దగ్గు వున్న వారిని గుర్తించి వారి కఫం నమూనాలను తప్పని సరిగా సేకరించి సకాలం లో స్పూటం పరీక్షలు నిర్వహిం చాలని డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ వెంకటప్ర సాద్ అన్నారు. డిఎంహెచ ఓ కార్యాలయం లో మంగళవారం ల్యాబ్ టెక్నిషియన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ పాజిటివ్ కేసులుగా నిర్ధారణ అయితే వెంటనే ఎస్‌టిఎస్‌కు నివేదించి డిఓటిఎస్ చికిత్సకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. అలాగే హెచ్ఐవి పరీక్షల కోసం ఐసిటిసి కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు తప్పనిసరిగా ముందస్తు కౌన్సెలింగ్ ఇచ్చి, గోప్యత పాటిస్తూ పరీక్షలు చేయాలని, అలాగే పాటిజివ్ కేసులను వెంటనే ఏఆర్‌టి కేంద్రానికి రెఫర్ చేయాలని సూచించారు. అలాగే గర్భిణీ స్త్రీలకు పిపిటిసిటి కింద హెచ్ఐవి పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలు పురస్కరించుకుని హైరిస్క్ ఏరియాలను గుర్తించి విపులంగా రక్త పరీక్షలు చేయాలని, వీటిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ల్యాబ్ టెక్నిషియన్లు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నవీన్‌తేజ్ రాయల్, పిహెచ్‌సి ల్యాబ్ టెక్నిషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



పుల్లంపేట, జూన్ 2 ప్రభాతవార్త

పుల్లంపేట మండలం కేంద్రంలోని పుల్లంగేరు బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి పుల్లంపేట గ్రామానికి చెందిన కొండపల్లి రాజశేఖర్ ఆచారి 45 అను వ్యక్తి తన పని నిమిత్తం సీతారాంపేట పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా పుల్లంగేరు వంతెన సమీపంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడికి కొడుకు కుమార్తె కలరు ఈయన మృతి చెందడంతో పుల్లంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి ఈ విషయమై పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రైల్వేకోడూరు రూరల్, జూన్ 2 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని రాజానగర్ మామిడి కాయల మండీల వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో ముద్దపోలు వెంకటసుబ్బయ్య (56) అనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మామిడి కాయలు తరలించి తన మోటార్ బైక్ నందు ఇంటికి వెళ్తున్న సందర్భంలో వెనకవైపు వస్తున్న మ్యాక్సీ వాహనం అతివేగంగా వాహనదారున్ని ఢీకొనడంతో అక్కడికక్కడే వెంకటసుబ్బయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన తాసిల్దార్



రైల్వేకోడూరు రూరల్ జూన్ 2 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను మంగళవారం రైల్వేకోడూరు తాసిల్దార్ అమర్నాథ్, టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షుడు పోకల మణి, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోల లు పరిశీలించారు. గత రెండు రోజుల క్రితం అజ్ఞాత వ్యక్తులు డంపింగ్ యార్డ్ కు నిప్పు పెట్టడంతో నరసరంపేట, ఉంగరాల నగర్ తదితర చుట్టు ప్రక్క ప్రాంతాల వారు ఆ వాసనకు తట్టుకోలేక శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని, దీనిపై తక్షణమే పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని తాసిల్దార్‌ను కోరినట్లు పటాన్ మోలా తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి తిరుపతి కలెక్టర్ తో మాట్లాడి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని తాసిల్దార్ వచ్చి పరిశీలించినట్లు వారు తెలిపారు.

## గర్భిణిలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

### –అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట ప్రసాద్

కాణిపాకం, జూన్ 2 ప్రభాతవార్త:



ప్రతి గర్భిణిని నమోదు చేసి తప్పనిసరిగా సకాలంలో టీకాలు వేయించడం ఆశా వర్కర్లు బాధ్యత అని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం కాణిపాకం పీహెచ్‌సీలో ఆశా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ శిశు మరణాల తగ్గింపులో ఆశా వర్కర్లుదే కీలక పాత్ర అని తెలిపారు. అలాగే క్షయ, కుష్టువ్యాధి, హెచ్ఐవి వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి సకాలంలో పరీక్షలు చేయించుకునేందుకు ప్రోత్సహించి అంటువ్యాధుల నివారణకు ఆశాలు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వాతి సిందూర, మండలంలోని ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## వేపనపల్లి ఎమ్మెల్యేను కలిసిన జడ్పీ ఛైర్మన్

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:



తమిళనాడు కృష్ణగిరి జిల్లా వేపనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇటీవల డిఎంకె పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్‌ను జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణగిరిలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మంగళవారం వేపనపల్లి ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడిపల్లి జడ్పీటీసీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ దేవ, నాయకులు రవి, మురళీ తదితరులు వున్నారు.

## మహాప్రస్థానం వాహనంకు మరమ్మతులు

చిత్తూరుహెల్త్, జూన్ 2 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మహాప్రస్థానం వాహనంను మరమ్మత్తు చేసి మెరుగుపరచి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మంగళవారం మహాప్రస్థానం వాహనంకు మరమ్మత్తులు చేయాలని ఆర్ఎంఓ డాక్టర్ చంద్రమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సామాన్య నిరుపేదలు మృతి చెందితే పార్థీవ దేహాలను తీసుకుపోవడానికి వేల రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు అంబులెన్స్ వాహనాలు తీసుకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పెద్ద మొత్తంలో డుబ్బులు చెల్లించుకోలేని నిరుపేదలకు మహాప్రస్థానం వాహనంను మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు విసి గోపినాథ్, దాసరి చంద్ర, విజయ్‌కుమార్. పి.రఘు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు

పెనుమూరు, జూన్ 2 ప్రభాతవార్త:



మండల పరిధిలో ఆటో డ్రైవర్లు పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలకు స్వచ్ఛంధంగా కట్టుబడి వుండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తేనే పోలీసులు జోక్యం చేసుకుంటారని స్పష్టం చేశారు. అలాగే ఒకొక్క ఆటో డ్రైవర్‌కు మూడు స్టిక్కర్లను అందించిన ఎస్ఐ ఆ స్టిక్కర్లను ఎక్కడ అతికించాలనే విషయంను డ్రైవర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షణలో నైపుణ్యాలే కీలకం

చిత్తూరుహెల్త్, జూన్ 2 ప్రభాతవార్త:



అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడటానికి అవసరమైన క్లినికల్ నైపుణ్యాలు, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యాలు అవసరమని ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ అన్నారు. మురకంబట్టులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న అక్యూట్ క్రికికల్ కేర్ కోర్స్ మంగళవారం ముగిసింది. ఈ సమావేశంలో నియమిత వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్‌కర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో పాలు క్లినికల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్, జట్టు సమన్వయం ముఖ్యమన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమం అత్యవసర వైద్య సేవలు, క్రిటికల్ కేర్ నిర్వహణ, ప్రాణ రక్షణ విధానాలపై నిపుణులు అవగాహన కల్పించడంతో పాటు పలు అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని అత్యవసర, క్రిటికల్ కేర్ వైద్య సేవలపై విలువైన అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎంసి మిశ్రా, అపోలో ఇంద్రప్రస్థ ఆసుపత్రి సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ అజయ్‌కుమార్ శర్మ, ఏఎంసికి చెంది వాస్క్యులర్ సర్జన్ కల్నల్ మన్వేందు ఝా, డాక్టర్ దీపికా సిఎ, ముంబై నానావతి మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ అసుపత్రి ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్ విభాగాధిపతి డాక్టర్ రేనాల్డోపావ్రే, అపోలో ఇంద్రప్రస్థ అసుపత్రి న్యూరో ఐసియు హెడ్ డాక్టర్ మంజుల్ ఆగర్వాల్, ఎయిమ్స్ న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ భూమి మోత్వానీ, చెన్నై అపోలో సిమ్యులేషన్ సెంటర్ క్లినికల్ లీడ్ డాక్టర్ తిలక ముత్తయ్య, లోక్ నాయక్ ఆసుపత్రి సీనియర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నళిని బాలా పాండే తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఎస్ఐఆర్‌పై వర్క్‌షాప్: హాజరైన ఎమ్మెల్యే గురజాల



చిత్తూరురూరల్, జూన్ 2 ప్రభాతవార్త:

మంగళగిరి తెదేపా కేంద్ర పార్టీ కార్యాల యంలో భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమానికి మంగళవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావులు సర్ కార్యక్రమంపై పార్టీ పరంగా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై దిశా నిర్ధేశం చేసారు.

## రైతులు సేంద్రియ ఎరువులపై మొగ్గు చూపాలి



వి.కోట, జూన్ 2 ప్రభాతవార్త:

రాష్ట్రంలో రబి సీజన్ ప్రారంభంతో రైతులు తమ భూముల సారవంతం వైపు శ్రద్ధ చూపాలని అగ్రికల్చర్ ఆఫీసర్ అప్పోజీ తెలిపారు. రైతులు తమ పొలాల్లో సేంద్రీయ పద్ధతిలో పచ్చ రొట్ట పెంచి పూత దశలో కలియ దున్నడంతో భూసారం పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఈ ఏడు 13 క్వింటాళ్ల జీలుగ,7 క్వింటాల్‌ల జనుము విత్తనాలను 50 సబ్సిడీతో అందించడానికి ఏర్పాటు చేశామన్నారు. ఒక ఎకరం భూమికి 1015 కిలోలు అవసరముంటుందన్నారు. ఒక కిలోకి 80 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తిన 45 రోజులలో పూతదశలో దున్నాలి అన్నారు. వారి వివరాలు ఏపిఏఐఎంఎస్ ఆప్ లో నమోదు చేసుకొని రైతులు పొందచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, నాయకులు ఈశ్వర్, నారాయణస్వామి, గజేంద్ర, జనార్ధన్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వేరుశనగకు ప్రత్యామ్నాయంగా సోయాబీన్ పంట సాగు

వి.కోట, జూన్ 2 ప్రభాతవార్త

వి.కోట మండలంలో వేరుశనగ పంట కు ప్రత్యామ్నాయంగా సోయాబీన్ పంట సాగు చేయాలని అగ్రికల్చర్ ఆఫీసర్ అప్పోజీ పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ గుడిపల్లిలో ఏర్పాటు చేసిన సోయాబీన్ ఆయిల్ కంపెనీ వారి ఆధ్వర్యంలో సోయాబీన్ పంటను బై బ్యాక్ పద్ధతిలో సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. రైతులకు ఎకరా భూమికి 25 కిలోలు విత్తనాలు కంపెనీవారు ఉచితంగా సరఫరా చేస్తారన్నారు. పంట 90 రోజుల కాలం ఉంటుందన్నారు. వర్షాధారంగా గాని నీటి వనరులతో గాని నెలకు రెండు తడులు ఇస్తే సరిపోతుందన్నారు. ఎకరా పంటకు 6 నుండి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. హార్వెస్టింగ్ కూడా కంపెనీ వారు తగు యంత్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఆసక్తిగల రైతులు తమ పరిధిలోని ఆర్ఎస్ కె సెంటర్లలో పేర్లు నమోదు చేసుకొని జూన్ చివరిలో లోపు విత్తుకోవాలని పిలుపునిచ్చారు.

## మామిడి తోటలపై జంట ఏనుగులు దాడి

రామకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త



మండల పరిధిలోని ననియాలలో జంట ఏనుగులు మామిడి తోటలపై దాడి చేశాయి. సోమవారం రాత్రి నని యాల, 89 పెద్దూరు ప్రధాన రోడ్డులో దాటి మామిడి తోట లో ప్రవేశించి కొమ్ములు విరిచి కాయలను నేల రాల్చాయి. స్థానిక ప్రజలు ఒంటరిగా పంట పొలాల వైపు వెళ్ళవద్దని అటవీ అధికారులు సూచించారు. టపాకాయలు పేల్చి అటవీ ప్రాంతంలోకి మళ్లించేం దుకు అధికారులు ప్రయత్నం చేశారు. అటవీ లోతట్టు ప్రాంతంలో ఏనుగులకు మేత, తాగునీరు ఏర్పాటుతో కొంతమేరైనా పంటలు రక్షించుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.

## ఘనంగా శ్రీపెద్దపులి గంగమ్మ జాతర

శాంతిపురం, జూన్ 2 ప్రభాతవార్త



మండలంలోని రాళ్లబూదుగూరులో నెలకొన్న శ్రీ ప్రసన్న పెద్దపులి గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి పూజ, పాలకావడుల ఊరేగింపు, మధ్యాహ్నం అమ్మవారికి అభిషేకం, పూజ జరిపారు. రాత్రి పచ్చిగెరిగ, అగ్ని గుండం, బాణసంచా వేడుకలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి దీపారాధన, పొంగళ్లతో జాతర ముగియనుంది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీ టాప్ : కమీషనర్

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త



ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీ చిత్తూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 5438 పెన్షన్లకు గాను 5293 పెన్షన్లు మంగళవారం ఉదయం నాటికి 97.33శాతం మేర పంపిణీ పూర్తి చేశామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగుల సమన్వయంతో లబ్దిదారుల ఇళ్ల వద్దకే నేరుగా వెళ్లి పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కాగా జిల్లాలో రెండో స్థానంలో పలమనేరు మున్సిపాలిటీ, మూడో స్థానంలో నగరిమండలం, నాలుగోస్థానంలో నగరి మున్సిపాలిటీలు నిలిచాయి.

## నేడు ఓటేరుపల్లిలో యూరియా పంపిణీ

యాదమరి, జూన్ 2 ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఓటేరుపల్లి, కాశిరాళ్ళ రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి చరిత ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా అవసరం వున్న రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాసుపుస్తకంతో హాజరు కావాలని ఆమె కోరారు.

# వాడివేడిగా తిరుపతిరూరల్ మండల సర్వసభ్య సమావేశం

## -ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

తిరుపతిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. మంగళవారం ఎంపిడిఓ సమావేశ మందిరములో మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై అధికారుల పనితీరును ప్రశ్నిస్తూ ప్రజా ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. గాంధీపురం గ్రామ పంచాయతీలో ఇళ్లకు విద్యుత్ మీటర్ల మంజూరులో స్థానిక ఎమ్మెల్యే సంతకం తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారని ఎంపిటిసి జైకర్ ఘాటుగా ప్రశ్నించారు. అలాంటి జీవో ఉంటే చూపించండి...ఎమ్మెల్యే పేరు చెప్పి పేదలకు ఇబ్బందులు కలిగించడం సరికాదు అంటూ నిలదీశారు. దీనిపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం సమావేశంలో చర్చనీయాంశమైంది. రైతులకు సబ్సీడిపై అందించే వేరుశెనగ విత్తనాలు ఎందుకు అందలేదని ఎంపిపి మాధవరెడ్డి వ్యవసాయాధికారిని ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయాధికారి స్పందిస్తూ ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవడం లేదని వివరణ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టేలు శుభ్రత లేక కలుషితమవుతున్నాయని ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. అపరిశుభ్రంగా నీటి తొట్టేలు ఉన్నందున, ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### గాంధీపురంలో భూ కబ్జాల ఆరోఫణలు

గాంధీపురం గ్రామ పంచాయతీలో భూ కబ్జాలు జరుగుతున్నాయని ఎంపిటిసి జైకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 14,16లలో అక్రమంగా కాలువను పూడ్చివేసి ఆక్రమించే ప్రయత్నం చేశారన్నారు. అలాగే అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేసి, పంచాయతీ బోరును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాపోయారు. దీనిపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమావేశ మందిరము నిర్మాణం చేయాలని, తుమ్మలగుంట, యోగిమల్లవరం ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు పరిష్కారం చేయాలని, మరుగుదొడ్ల నదుపాయాల మెరుగుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి రత్నమ్మ, ఎంపిడిఓ మస్తాన్ వల్లీ, డిప్యూటీ దయసాగర్, డిప్యూటీ తహశీల్దార్లు రామచంద్ర, యుగంధర్, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# మీ భద్రతే మా బాధ్యత

సిఐ శ్రీనివాసులు

ఓబులవారిపల్లి, 2 జూన్ ప్రభాతవార్త



మహిళలు ప్రస్తుత సమాజంలో జీవన విధానంలో అప్రమత్తంగా ఉండాలని రైల్వేకోడూరు రూరల్ సిఐ. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఓబులవారిపల్లి మండలం వైకోట గ్రామంలో నిర్వహించిన మహిళల భద్రతపై అవగాహన సదస్సులో మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ భద్రతే మా బాధ్యత అని మహిళలు కుటుంబ విలువలను కాపాడుకోవాలని సైబర్ నేరాల ఉచ్చులో పడవద్దన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం ఎంతో సంతోషకరమని, పోలీసులు సూచిస్తున్న పలు సలహాలు సూచనలు పాటించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా సైబర్ నేరాలు ఉచ్చులో పడకుండా ఎవరికంటే వారికి ఫోన్లు మిస్‌కాల్ వచ్చినప్పుడు మహిళలు జాగ్రత్త వహించాలని, ఎవరైనా మిస్ బిహేవ్ చేస్తే వారి గురించి పోలీసులకు తెలపాలన్నారు. అనంతరం ఎస్సై మహేష్ నాయుడు మాట్లాడుతూ అధిక సంఖ్యలో ద్వాక్రా మహిళలు వైద్య సిబ్బంది వెలుగు సిబ్బంది మహిళలు పాల్గొనడం ఎంతో మంచిది అని, ప్రతి ఒక్కరు భద్రత పైన అవగాహన కలిగి ఉంటే దారి పొడువున నడిచేవారు వారి మెడలో గొలుసులు లాక్కొని వెళ్లడం, ఫోన్లు లాక్కొని వెళ్లడం దొంగతనాలు జరుగుతున్నాయని అటువంటి వాటి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు ద్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# పేదలకు వరం..ముఖ్యమంత్రి సహాయనిధి.

చిట్వేలి, జూన్ 2 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక గొప్ప వరం అని టిడిపి మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. మంగళవారం రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కస్తూరి కోటేశ్వర చౌదరి సిఫారసుతో రెండు లక్షల 6 వేల రూపాయలను ఐదు మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మద్దిన ప్రమీలమ్మ (చిట్వేలి),కస్తూరి మునీశ్వర(కస్తూరివారిపల్లి), బుంగటావుల రాధమ్మ (రెడ్డివారిపల్లి), గోసల ఇందిరమ్మ (రెడ్డివారిపల్లి), తుంగా శ్రీదేవి (తుమ్మచెట్ల పల్లి) లబ్ది చేకూరిన వారిలో ఉన్నారు. తదుపరి కాకర్ల నాగార్జున మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఊరట కల్పిస్తూ వారి ఇంట తిరిగి సంతోషాన్ని నింపడంలో ముఖ్య మంత్రి సహాయనిధి కీలకపాత్ర పోషిస్తూ ఉందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తూ వారి కష్టాలలో పార్టీ పరంగా మేము తోడుగా నిలవడం మిక్కిలి సంతోషంగా ఉందని తెలిపారు. తమను సంప్రదించిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సహాయ నిధి పొందిన లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, కె కె చౌదరికి, కాకర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటేష్ రాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు పగడాల వెంకటేష్, యూనిట్ ఇన్‌చార్జ్ బండారు శివ, బూత్ ఇంచార్జ్ మద్దిన కోటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు తుంగా చిన్న సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ



విజయపురం, జూన్ 2 ప్రభాతవార్త:

మండలంలోని విజయపురం జడ్పీ హైస్కూలులో మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో హరిప్రసాద్‌వర్మ నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ వంటగది పరిశుభ్రత, పరిశుభ్రత, మధ్యాహ్నం భోజన పథకం మెను ప్రకారం రుచికరమైన వంటలను తయారు చేసివిద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సీసీహెచ్ అబ్జర్వర్ యశోదమ్మ, మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు, సీఆర్పీ హెచ్‌ఎం సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల్లూరు సుబ్రహ్మణ్యంకు ఘన సత్కారం

తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త



ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ నెల్లూరు సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు మంగళవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ బోధనేతర సిబ్బంది సంఘం ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగ మిత్రులు కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్వీయూ బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు శ్రీధర్ గుర్రంకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు సుబ్రహ్మణ్యంను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, హక్కుల పరిరక్షణ కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు నాయకులు కొనియాడారు. ఉద్యోగ సంఘాల బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సంఘ ప్రతినిధులు, విశ్వవిద్యాలయాలు మరియు అనుబంధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సంక్షేమం కోసం సుబ్రహ్మణ్యం అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, వాటి పరిష్కారం కోసం పోరాటం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటగారం మురళి, కార్యదర్శి గురుప్రసాద్, ముత్తువేలు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సిరిగిరి రమేష్, హేమంత్ రాయల్, అశోక్, విజయసారథి, లక్ష్మీ మనాథ్, ప్రదీప్ కుమార్, ఎంప్లాయిస్ బ్యాంక్ అకౌంటెంట్ భాస్కర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ మిత్రులు, సంఘ నాయకులు, మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా నెల్లూరు సుబ్రహ్మణ్యంకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ ఆయన మరింత కాలం ఉద్యోగుల సేవలో కొనసాగాలని కోరారు. అనంతరం సంఘ నాయకులు, ఉద్యోగులు కలిసి ఆయనతో స్మారక చిత్రాలు దిగుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# మానవ అక్రమ రవాణా నిరోధానికి జిల్లా స్థాయి కమిటీ సమావేశం

తిరుపతి విద్య జూన్2 ప్రభాత వార్త




మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వరలక్ష్మి మ్మ సూచించారు. మంగళవారం జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మ్మ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా కేసులను గుర్తించి బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. బాలలు, మహిళలు, వలస కార్మికులు అక్రమ రవాణాకు గురికాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పరిశ్రమలు, హోటళ్లు, కార్మికుల కూడళ్లు వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అనుమానాస్పద పరిస్థితులు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు, కార్మిక శాఖ ప్రతినిధులు, రైల్వే పోలీసులు, ఆర్టీసీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కోఆర్డినేటర్ వెంకటేష్ మునిస్వామి, ఎం. బాషా, నవజీవన్ ప్రతినిధి ఎం. చంద్రశేఖర్, కే. వెంకటేష్, చైల్డ్‌లైన్ ప్రతినిధి బి.డి. నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌లో భాగంగా ఎస్ఎల్ఎఫ్, ఆర్‌పీ, గ్రామ సమాఖ్యల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశానికి డీపీఎంయూ సభ్యులు, సిఎంఎం/టీఎంసీబీ టీఎల్ఎఫ్ఓబీ ప్రతినిధులు హాజరయ్యారు.

# తిరుపతి డివిజన్

## చెంచువారికాలనీలో గంగ జాతర వైభవం

తిరుపతిరూరల్,జూన్ 2 ప్రభాతవార్త:



తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచువారికాలనీలో గంగ జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సంప్రదాయంగా అమ్మవారికి అంబలి నైవేద్యం సమర్పిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. జడ్పిటిసి రత్నమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయించి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. జాతర నిర్వహణలో వరాలు కీలక పాత్ర పోషిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. చెంచయ్య, సుబ్రమణ్యం, వెంకటరత్న తదితరులు సేవా కార్యక్రమాలలో పాల్గొని...జాతర విజయవంతానికి సహకరించారు. ఈ జాతర గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తి, సంస్కృతి కలిసిన ఈ వేడుక గ్రామ ప్రజల్లో ఆధ్మాత్మిక చైతన్యాన్ని పెంపొందించింది

## శెట్టిపల్లి భూ వివాదంపై ప్లాట్‌దారుల ఆందోళన

350 మంది బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త



శెట్టిపల్లి ప్రాంతంలో భూ యాజమాన్య వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2006లో కొనుగోలు చేసిన ప్లాట్లను ప్రస్తుతం ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న అధికారుల వైఖరిపై ప్లాట్‌దారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధితులు మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసి తమ సమస్యను వివరించారు. తాము ప్రైవేట్ వ్యక్తుల నుంచి చట్టబద్ధంగా భూములు కొనుగోలు చేశామని, అయితే ఇప్పుడు అదే భూమిని ప్రభుత్వ భూమిగా అధికారులు పేర్కొంటున్నారని ప్లాట్‌దారులు తెలిపారు. భూమి ప్రభుత్వానిదే అయితే ల్యాండ్ పూలింగ్ సమయంలో తమ అనుమతి ఎందుకు తీసుకున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 387లోని భూమి ప్రభుత్వానిదని చెబుతున్న అధికారులు, ఇటీవల అదే భూమిని సబ్‌డివిజన్ చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డబుల్ రిజిస్ట్రేషన్ల కారణంగా సమస్య తలెత్తి ఉంటే వాటిని రద్దు చేసి సుమారు 350 మంది ప్లాట్‌దారులకు న్యాయం చేయాలని కోరారు. ప్లాట్‌దారుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు.

## పెద్దాశ్రమంలో సంస్కృత విద్యాభివృద్ధిపై చర్చలు

తిరుపతి విద్య, జూన్2 ప్రభాతవార్త



కృష్ణాజిల్లా తాడేపల్లిలోని శ్రీ మలయాళ స్వామి పెద్దాశ్రమంలో సంస్కృత విద్యాభివృద్ధి, విద్యాసంస్థల విస్తరణ అంశాలపై ఆశ్రమ యాజమాన్యం , జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ప్రతినిధుల మధ్య సోమవారం కీలక చర్చలు జరిగాయి. విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ జీఎస్ఎస్ఆర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెద్దాశ్రమానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం గుర్తింపు కల్పించే అవకాశాలపై పరస్పర సంప్రదింపులు నిర్వహించారు. ఆశ్రమం తరఫున విశ్వవిద్యాలయ గుర్తింపు కోసం అభ్యర్థన చేయగా, విశ్వవిద్యాలయం తరఫున అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి విద్యా కార్యక్రమాల విస్తరణకు సహకరించాలని సూచించారు. అలాగే ఆశ్రమంలో పూర్వపండితుడు (ఇంటర్మీడియట్)తో పాటు ఇతర సంస్కృత కోర్సులను ప్రారంభించే అవకాశాలపై కూడా చర్చించారు. సంస్కృత విద్యను మరింత విస్తరించేందుకు ఉమ్మడిగా కృషి చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పెద్దాశ్రమ యాజమాన్య సభ్యులు, విశ్వవిద్యాలయ అధికార బృందం పాల్గొన్నారు. త్వరలోనే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుని తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

## పశుపక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల పంపిణీ

తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త




వేసవి తీవ్రత నేపథ్యంలో పశువులు, పక్షులకు తాగునీటి కొరత లేకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా నీటి తొట్టెల ఏర్పాటు అభినందనీయమని అన్నారు. నగరంలోని 36వ డివిజన్ పరిధిలోని అనంతవీధి జంక్షన్ వద్ద జనసేన నాయకుడు జేకే రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం తొట్టెల్లో స్వయంగా నీటిని నింపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పేదలకు తన సొంత నిధుల ద్వారా సహాయం అందిస్తున్నారని అన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు రావడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని జనసేన కార్యకర్తలకు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మూగజీవాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, పొన్నాల చంద్ర, సీకే రేవతి, సీకే రవి, కోదండరెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, లచ్చి రాయల్, పోటుకూరి ఆనంద్, కట్టా రామకృష్ణ, శాంతి యాదవ్, చరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF SURNAME**

● I, YELLAMSETTY SIVA PRASAD (Old Name), S/o YALLAMSETTY VENKATESWARLU,R/at D.No: 19-3-1/PC4, Kaikala Cheruvu, Postal Colony, Tirupati, AP, have changed my Surname To YALLAMSETTY SIVA PRASAD. Henceforth, I Shall be known as YALLAMSETTY SIVA PRASAD (New Name).

# 5 దశాబ్దాల వ్యవసాయ సాగులో మార్పులు

## విషతుల్యమైన వ్యవసాయ భూములు

## జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎం.రెడ్డి శేఖర్

చంద్రగిరి, జూన్ 2 ప్రభాతవార్త:



5 దశాబ్దాల కాలక్రమంలో వ్యవసాయ సాగులో చోటుచేసుకున్న ఎరువుల వాడకం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎం.రెడ్డి శేఖర్ తెలిపారు. నారావారిపల్లిలో మంగళవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ళలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించే లక్ష్యంతో హైబ్రీడ్ రకాలను రూపొందించినట్లు తెలిపారు. ఎరువులను విపరీతంగా వినియోగించడంతో భూమి విషతుల్యమవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మానవ ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపడం మొదలయ్యిందన్నారు. బిపీ, షుగర్, థైరాయిడ్, ఒబిసిటి వంటి జబ్బులు, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి జ్వరాల బారినపడుతున్నారని అన్నారు. కార్బోహైడ్రేట్స్ అధికంగా గల వరి, గోదుమను ఆహారంగా తీసుకుంటున్న మనం అధిక పోషకాలు కలిగిన జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాల పంటలను దాదాపు మరచిపోయామన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి. మీ పిల్లలకు చిక్కీలు, సేమియా వుండలు స్నాక్స్‌గా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేమన, డాక్టర్ వై.రెడ్డి రామ్, డాక్టర్ సుబ్రమణ్యం, ఏ.రాజేష్, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, డాక్టర్ పి.సుధాకర్, అనిల్‌కుమార్, ఏపిసిఎన్ఎఫ్ డిపిఎం షణ్ముగం, మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఏఈఓలు అమీర్, భరత్ గణేష్, ఆర్ఎస్‌కె, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధరలు పెంచి...ప్రజలపై భారం మోపారు

**- రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య**




బాలాయపల్లి, జూన్ 2 ప్రభాతవార్త: పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజలపై పెనుబారం మోపాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన ఒక నెల రోజుల్లోనే నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్, సీఎన్జీ, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచారని దీంతో అన్ని నిత్యావసర ధరలు, రసాయనిక ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనం 85 శాతం ముడి చమురును ఇప్పటివరకు ఇరాన్, రష్యా నుంచి తక్కువ రేట్లకు దిగుమతి చేసుకుంటుండగా అమెరికా ఆంక్షలు విధించిందన్నారు. భారత పాలకులు అమెరికా ఆంక్షలకు తలొగ్గి ఇరాన్, రష్యాలనుంచి కొనకుండా ఆపేశారన్నారు. నేడు అమెరికా నుంచి అధిక ధరకు కొనుగోలు చేయడం వల్లనే ఆయిల్ ధరలు పెంచారన్నారు. మన కృష్ణాగోదావరి బేసిన్‌లో ఉన్న ముడిచమురు రిలయన్స్ కంపెనీకి కట్టబెట్టడంతో గుజరాత్ లో శుద్ధి చేసి ఎక్కువ ధరలకు విదేశాలకు అమ్ముకొని లాభపడుతుందన్నారు. దేశంలో కార్పొరేట్లను, అమెరికా కంపెనీలను లాభపరచడానికే మోడీ అనుసరిస్తున్న విధానాలు తోడ్పడుతున్నాయన్నారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు కె.అజిత మాట్లాడుతూ భారత పాలకులు పెంచిన ఆయిల్ ధరల వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయి సామాన్యులపై భారం పడిందని తెలుపుతూ మోడీ లొంగుబాటు విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి జి.కృష్ణారెడ్డి, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు డి. భాస్కర్, ఆటో కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

## సర్ వర్క్ షాప్‌లో ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త : విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సర్ అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌కు తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై ప్రజా ప్రతినిధులకు, పార్టీ నాయకులకుదిశా నిర్దేశం చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా ఎలా తీసుకువెళ్లాల అనే అంశంపై ఆయన కొన్ని సూచనలు చేశారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి చురుకైన పాత్రను పోషించాలని కోరారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్ వర్క్ షాప్‌లో అందజేసే విలువైన సమాచారాన్ని అవగాహన చేసుకుని వాటిని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పరిశీలకులు పాల్గొన్నారు.

## రాజస్థాన్ సేవ సంఘం వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం



సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని రాజస్థాన్ సేవ సంఘం సహకారంతో, చెన్నై మెట్రో మహవీర్ క్లబ్ సౌజన్యంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని జైన్ ప్రార్థన మందిరంలో నిర్వహించిన ఈ శిబిరంలో 99 మంది రోగులను పరీక్షించి వారిలో 46 మందికి శాస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఎస్వి అరవింద్ నేత్రాలయం తిరుపతి చెందిన డాక్టర్ల ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. శాస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని తిరుపతి అరవింద్ నేత్రాలయకు తీసుకువెళ్లి చికిత్సలు అనంతరం తిరిగి సూళ్లూరుపేటకు తీసుకు రావడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దగల్ చంద్ ముఖేష్ బండారి చెన్నై వారి దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి నెలలో మొదటి మంగళవారం ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా తమ రాజస్థాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు



వాకాడు, జూన్ 2 ప్రభాతవార్త: వాకాడు, చిట్టమూరు మండలాల్లోని గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న గర్భిణీ స్త్రీలకు మంగళవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ నిర్వాహకులు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కోట ఐసిడిఎస్ ప్రాజక్టు పరిధిలోని వాకాడు మండలం కొండూరు పంచాయతీ పరిధిలో ఉన్న బూడిదల వాగు గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించి గర్భవతులకు సారే చీర, గాజులు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, స్వీటు హిందూ సాంప్రదాయ బద్ధంగా సామూహిక శ్రీమంతం నిర్వహించారు. అదే విధంగా కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేసి, వేసవి వడగాలిపులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చరిగా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది విజయమ్మ, అరుణమ్మ, గర్భవతులు, కిశోర బాలికలు, అంగనవాడి పరిధిలోని చిన్నారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ



బాలాయపల్లి, జూన్ 2 ప్రభాతవార్త: ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్‌గా ఎం రామకృష్ణ ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. గ్యారంపల్లి గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పని చేస్తూ పదోన్నతి పై ఇక్కడకు బదిలీ అయ్యారు. నూతన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో గతంలో వలె మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. అదే విధంగా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు మంచి పౌష్టిక ఆహారాన్ని అందజేస్తామని తెలియజేశారు. పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమాదేవి, జగన్నాథం, శ్యామల ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలియజేసినారు.

## వైభవంగా పానగల్ గంగమ్మ జాతర చాటింపు





శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: పట్టణంలోని పానగల్ గంగమ్మ జాతర ఈ నెల 8,9 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి శ్రీ పానగల్ గంగమ్మ జాతర చాటింపు కార్యక్రమాన్ని జరిగింది. గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని ప్రధాన కూడలి యందు ప్రత్యేక పూజలు నిర్వహించి చాటింపు వేశారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ జాతర కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రధాన జాతరను తలపించిన...తాతయ్యగుంట గంగమ్మ మరు పొంగళ్ళు





తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త: తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడవ మంగళవారం "మరు పొంగళ్ళు" కార్యక్రమం భక్తిభావంతో ఆధ్యాత్మిక వైభవాలతో అత్యంత ఘనంగా జరిగింది. తిరుపతి నగర ప్రజల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, పొంగళ్ళ సమర్పణలు నిర్వహిస్తూ భక్తులు అపారమైన భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. మంగళవారం ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, ఆధ్యాత్మిక వేషధారణలతో భక్తి పరవశంగా ప్రత్యేక ఊరేగింపులో పాల్గొన్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు సాగింది. గత మంగళవారం వర్షం కుర వగా నేడు కూడా వర్షం పడడంతో కళాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ పాలకమండలి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల పాటు మరు పొంగళ్ళు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంద న్నారు. సంప్రదాయ వేషధారణలతో కళాకారులు అమ్మవారిని దర్శించు కోవడం ద్వారా సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలు తరతరాలకు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు, గుణశేఖర్, ముని, వాసు, చంగల్ రాయలు, సిద్దవరం వెంకటాద్రి, రాజా, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, కర్నాటము మురళి, వెంకటాచలం, వాసుదేవ రెడ్డి, మునప్ప గారి మునినాథరెడ్డి, శ్రావణి, అరుణమ్మ, విగ్రహాల కళ్యాణి, సిద్ధమ్మ, పద్మావతి, అరుణ, జ్యోతి, లక్షి ృ, భక్తులు, మహిళలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం

## గోశాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తికి పరిశీలన



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొనుటకు మరో అడుగుముందుకేసింది. ఈ నేపథ్యంలో దేవస్థానంకు అనుబంధంగా నిర్వహిస్తున్న గోశాల నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తికి పరిశీలన జరిపారు. మంగళవారం సిఎస్ఐఆర్ ప్రతినిధులు డాక్టర్ సి, చంద్రశేఖర్, పి.రాజేష్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ హెచ్ఆర్‌డి కన్సల్టెంట్ మహేష్, రాజాలు గోశాలను దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. గోశాలలో సుమారు 12వందల పశువులున్నాయి. వాటి ద్వారా వచ్చే పేడ వ్యర్థాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన పొదుపు లక్ష్యాలతో ఆలయ ఇఓ బికె వెంకటేశులు సూచనల మేరకు ప్రతినిధి బృందం గోశాలలో సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఇక్కడ ఎంత పేడ వస్తుందనే అంశాలను అంచనా వేసారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకంలో వాడుతున్న వంట గ్యాస్‌ను అంచనా వేసారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఇఇ శ్రీనివాసరాజు, డెప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డి, ఎఇఇ శోభారాణి, హార్టికల్చర్ శివకుమార్ గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఆస్తి నష్టం

తిరుచానూరు, జూన్ 2 ప్రభాతవార్త: గ్యాస్ సిలిండర్ పేలి తీవ్ర ఆస్తినష్టం జరిగిన ఘటన తిరుచానూరు పంచాయతీ పొన్నకాల్వ సమీపంలో మంగళ వారం చోటుచేసుకుంది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సోలార్ ప్యానల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న శరత్ వేసవి సెలవులు అని నెల రోజులు ఇంట్లో లేరు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్రిజ్, గ్యాస్ ఒక్కేసారి పేలడంతో తీవ్ర తీవ్రమైన అగ్నిప్రమాదం వాటిల్లింది. ప్రాణనష్టమేమీ లేకపోయినా ఆస్తి నష్టం బాగా ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. చుట్టుప్రక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సిబ్బంది ఫీజు క్యారేజీలు తీసేశారు. మంటలు అదుపు కావడంతో చుట్టుపక్కల ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

## రాష్ట్రస్థాయిలో డాక్టర్ మోహన్ అరుదైన ఘనత

**- కుప్పం విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ**

**-ఎంబిబిఎస్ పిజిలో బంగారు.. వెండిపతకాలు కైవశం**



కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త: కుప్పం మండలం కృష్ణదాసనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ శ్రీమతి సరస్వతి, మోహన్ దంపతుల కుమారుడు డాక్టర్ మోహన్ యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో అరుదైన ఘనతను సాధించారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పరిధిలో రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలను ఆయన మంగళవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, వర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ డాక్టర్ నరసింహన్, డాక్టర్ పిసి రాథ్‌ల సమక్షంలో అందుకున్నారు. విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో 29,30వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ మోహన్ యశ్వంత్ ఎంఎస్ ఆర్థోపెడిక్స్ విభాగంలో అత్యంత ప్రతిభా వంతమైన విద్యార్థిగా ప్రొఫెసర్ ఎతిరాజులు గోల్డ్‌మెడల్‌ను సాధించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో ఎంఎస్ ఆర్థోపెడిక్స్ పూర్తిచేసిన విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు డాక్టర్ లక్ష్మీవర ప్రసాద్ సిల్వర్ మెడల్‌ను అందుకున్నారు. డాక్టర్ మోహన్ యశ్వంత్ తన శిక్షణను ప్రముఖ ఆర్థోపెడిక్ విద్యావేత్త ప్రొఫెసర్ శ్రీనివాసరావు నేతృత్వంలో పూర్తి చేశ్రారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి వైద్య విద్యలో అత్యుత్తమ ప్రతిభ చాటిన మోహన్ యశ్వంత్ అరుదైన అవార్డులు అందుకోవడం పట్ల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, బంధుమిత్రులు, ప్రముఖులు మోహన్ యశ్వంత్‌ను అభినంది స్తున్నారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ఆహార పదార్థాలు తగినంత వడ్డించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, 2 జూన్ ప్రభాతవార్త: నగరంలోని అన్నా క్యాంటీన్లలో ఆహార పదార్థాలు వృధా చేయకుండా ప్రజలకు తగినంత వడ్డించాలని నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి భోజనం రుచి చూసి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## 11 న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లె, జూన్ 2 ప్రభాతవార్త : ఈ నెల 11 ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో నారాయణ తెలిపారు. సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ పథకం తదితర వాటిపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

## 4న వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం : ఎంపీ



బాలాయపల్లి, జూన్ 2 ప్రభాతవార్త: ఈ నెల నాలుగో తేదీ నుండి జరిగే వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం. గురుమూర్తి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమాలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయ వంతం చేయాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ సత్తా చాటాలని తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే ఈ నెల 4వ తేదీ నుంచి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచేయాలని, కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని చర్చించుకున్నారు.

## వైభవంగా గురుదక్షిణామూర్తి గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద మంగళవారం గురుసంక్రమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చింది, నవగ్రహాల్లో పంచమ గ్రహమైన గురు గ్రహం, మిథున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించు శుభ సమయాన దక్షిణామూర్తి ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల తరువాత నిర్వహించిన అలంకారాన్ని చూడటానికి వేయి కళ్లు సరిపోవని విధంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నిర్వహించిన చందనాలంకారంను చూడటానికి భక్తులు నిరీక్షించారు. సాయంత్రం గురుదక్షిణామూర్తిని చక్కగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌ల పర్యవేక్షణలో నాలుగుమాడావీధుల్లో సాగింది.

## షిరిడి సిఇఓకు పరశురామేశ్వరుని ప్రసాదాలు



ఏర్పేడు, జూన్ 2 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు దంపతులు మంగళవారం షిరిడిలో వెలసిన సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిఇఓ గోరక్ష గడిల్కర్‌ను కలసి గుడిమల్లంలో వెలసిన పరశు రామేశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే భారత దేశంలో మొదటి శివాలయంగా ప్రసిద్ధి చెందిన పరశురామేశ్వరాలయం చరిత్రను తెలిపే పుస్తకాన్ని అలాగే స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను ఆయనకు అందించారు. షిరిడిలో చైర్మెన్ దంపతులకు అక్కడి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయ పండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా సిఇఓ గోరక్ష గడిల్కర్‌తో పాటు వేదపండితులు, అలయ అర్చకులును గుడిమల్లంకు రావాలని చైర్మెన్ గిరినాయుడు ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించారు.

## అటవీ భూముల్లో రోడ్ల నిర్మాణాలకు ఆమోదం

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త: బంగారుపాళ్యం మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మూడు రోడ్ల నిర్మాణానికి ఆర్ఓఎఫ్‌టిఎఫ్, ఎఫ్ఆర్ఎ చట్టం జిల్లా స్థాయి కమిటీ ఆమోదించింది. కలెక్టరేట్‌లోని నాగార్జున వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన ది షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ అదర్ ట్రెడిషనల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్(రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) యాక్ట్-2006 మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఓఎఫ్ టిఎఫ్, ఎఫ్ఆర్ఎ చట్టం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 2006 సంవత్సరంలో అటవీ భూములపై ఆధారపడి జీవవిస్తున్న వారికి మేలు చేయడానికి పార్లమెంటు ఒక చట్టం తీసుకువచ్చిందన్నారు. దేశంలో మొదటిసారిగా అటవీ భూములు సాగు చేసుకుంటున్న వారి హక్కులను ఈ చట్టం గుర్తించిందన్నారు. బంగారుపాళ్యం మండల పరిధిలోని మూడు రెవెన్యూ నివాసాల కోసం ప్రతిపాదనలను పరిశీలించి కమిటీ ఆమోదించింది. బంగారుపాళ్యం మండలంలోని తుంబకుప్పం గ్రామం నుండి పీలేరు చెట్టుపల్లి కాలనీ వరకు రోడ్డు నిర్మాణం కోసం 0.972 హెక్టార్ల అటవీ భూమి, అలాగే గొర్రెల నగరి నుండి వేపనపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టడానికి 0.970 హెక్టార్ల అటవీభూమి, అలాగే రాగిమానుపెంట గ్రామం నుండి కెఎం కండ్రిగ గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టడానికి 0.675 హెక్టార్ల అటవీ భూమిని రోడ్ల నిర్మాణం కోసం కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి, పిఐయు ఇఇ నాగరాజు, పిఐయు ఎఇ నరసింహారెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ సుదర్శన్‌బాబు, అటవీశాఖ రేంజ్ అధికారి పట్టాభి, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, జడ్పీటిసీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## గజవాహనంపై కల్యాణ వెంకన్న



తిరుపతి (నారాయణవనం), జూన్ 2 ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణ వనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి గజవాహనంపై స్వామివారు భక్తులకు కటాక్షించారు. రాజుల ఊరేగింపులో గజరాజులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. గజరాజునిపై వచ్చిన స్వామివారు తనను నమ్మి కొలచిన వారికి శుభాలు కలుగుతాయని తెలిపారు. ఉదయం హనుమంత వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7.30 గంటలకు కల్యాణ వేంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ భక్తిరసపూరితంగా సాగింది. హనుమత్స్మరణ ద్వారా సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వైకాపా తప్పుడు ప్రచారం ప్రజలు నమ్మరు : ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: మెగా డియస్సికి సంబంధించి వైకాపా నేతల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డియస్సి గురించి మాట్లాడే నైతికహక్కే లేదన్నారు. ఐదేళ్ళ పాలనలో ఒక్క ఏడాది అయినా నిరుద్యోగులకు సంబంధించి పట్టించుకోలేదు. ఒక్క డియస్సి అయినా జరపలేదని అలాంటి వారు డియస్సి నిర్వహించి ఉద్యోగాల్లో ఏడాది పాటు ఉద్యోగాలు చేసుకుంటున్న వారిని ఇబ్బంది పెట్టేరీతిలో వైకాపా వ్యవహరించటం గమనిస్తే వీరి నైజం తెలుస్తుందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడిన వైకాపా నేతలు నేడు తగుదనమ్మా అంటూ మాట్లాడటం గమనిస్తే మంచిని జీర్ణించుకునే మనస్సు లేదన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే తొలి సంతకం డియస్సి ఫైల్ పై పెట్టారన్నారు. 148 రోజుల్లో 15,941 మందికి ఉపాధి అవకాశం కల్పిస్తే దానిలో తప్పు పట్టి తప్పుడు ప్రకటనలతో జనాన్ని ఇబ్బంది పెట్టడం తగదన్నారు. మెగా డియస్సిని ఆపుటకు వైకాపా నేతలు దొడ్డిదారిన కోర్టులో 241 కేసులు వేయించినప్పటికి పాదర్శకంగా చిత్తశుద్ధితో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందన్నారు. అభ్యర్థుల మెరిట్‌జాబితాలు, ర్యాంకులు, రిజర్వేషన్లు అమలు ఎంపిక ప్రక్రియకు సంబంధించి అన్ని వివరాలను బహిరంగంగా వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు ఎస్‌సి వర్గీకరణ, మహిళలు, దివ్యాంగులు రిజర్వేషన్లను నిబద్ధతతో చేసామన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిన వైసిపి ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై బురద చల్లటం దారుణమన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 1,351 మంది గైర్హాజరు: ఆర్‌ఐఓ

**తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త**

తిరుపతి జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (ఐపీఏఎస్‌ఈ) పరీక్షలకు మొత్తం 1,351 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రాంతీయ తనిఖీ అధికారి ఆర్‌ఐఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 8,668 మంది విద్యార్థులు కేటాయించగా, 7,945 మంది హాజరయ్యారని, 723 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 3,633 మంది విద్యార్థులు కేటాయించగా, 3,005 మంది హాజరై, 628 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మొత్తం 12,301 మంది విద్యార్థులకు అవకాశం కల్పించగా 10,950 మంది హాజరయ్యారని ఆర్‌ఐఓ వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు.

## పదో తరగతి పరీక్షకు 391 మంది గైర్హాజరు

**తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాత వార్త**

తిరుపతి జిల్లాలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 391 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కేవీఎన్ కుమార్ తెలిపారు. సాంఘిక శాస్త్రం పరీక్షకు 1,988 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 1,597 మంది హాజరై పరీక్ష రాశారని, 391 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 314 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 266 మంది హాజరై, 48 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పరీక్షలకు 206 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 166 మంది హాజరై 40 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షి ంచేందుకు తాను రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కూడా రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎనిమిది పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు మూడు కేంద్రాల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 28 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

## తిరుపతి కోర్టుల్లో పెండింగ్ కేసుల భారం తగ్గించండి

**- తిరుపతి బార్ అసోసియేషన్ వినతి**

తిరుపతి(లీగల్), జూన్ 2 ప్రభాతవార్త: తిరుపతిలోని వివిధ న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్నకేసుల సంఖ్య అధికంగా ఉండడంతో, అదనపు సీనియర్‌సివిల్‌జడ్జి పోస్టు, జడ్జి పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ తిరుపతి బార్ అసోసియేషన్ హైకోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యకు వినతిపత్రం సమర్పించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపిచంద్ ఆధ్వర్యంలో పంపిన ఈ వినతిపత్రంలో తిరుపతి కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో ఉందని పేర్కొన్నారు. ఏఎస్‌సీ కోర్టులో 857 కేసులు, రెండో ఏడీఎం కోర్టులో 2249 కేసులు, మూడో ఏడీఎం కోర్టులో 1450 కేసులు, 4 ఏడీఎం కోర్టులో 1800కేసులు, ఐదో ఏడీఎంకోర్టులో 1968కేసులు, ఆరవ ఏడీఎం కోర్టులో 513 కేసులు, ప్రత్యేక ఆర్‌ఎస్‌ఎస్ జేఎఫ్‌సీఎం కోర్టులో 2460 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మొత్తంగా మే 2026 నాటికి 10,440కేసులు వివిధ కోర్టుల్లో విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు సత్వర న్యాయం అందించాలంటే ఖాళీగా ఉన్న అదనపు సీనియర్ సివిల్ జడ్జి పోస్టు, జూనియర్ సివిల్ జడ్జి పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి బార్ అసోసియేషన్ అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని వీలైనంత త్వరగా నియామకాలు చేపట్టాలని హైకోర్టు పరిపాలన న్యాయమూర్తిని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల అదనపు కోర్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో తిరుపతి కోర్టులకు కూడా అవసరమైన న్యాయమూర్తుల నియామకం జరగాలని న్యాయవాదులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి

**కమిషనర్ శారదాదేవి**




తిరుపతి కార్పొరేషన్, జూన్ 2 ప్రభాతవార్త: నగరంలోని మురుగునీటి కాలువల్లో ఏర్పడ్డ సిల్ట్ (చెత్త)ను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదాదేవి అధికారులకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని ఎర్ర మిట్ట, పల్లి వీధి, వేశాలమ్మ గుడి దగ్గర, టౌన్ క్లబ్ కూడలి వద్ద జరుగుతున్న కాలువల్లో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని పెద్ద పెద్ద డ్రైన్లలో పేరుకు పోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని తెలిపారు. రుతుపవనాల వల్ల రానున్న వర్షాలతో నీరు సజావుగా వెళ్లేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతో స్వచ్ఛ తిరుపతి సాధ్యం అవుతుందని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎర్రమిట్టలో ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోర్ వేసేందుకు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, మాజీ కార్పొరేటర్ నరసింహ ఆచారి, ఏసిపి మూర్తి, డిఈ లు రమణ, లలిత, డీఎఫ్‌ఓ శ్రీనివాసరావు, శానిటేషన్ సూపర్వైజర్ లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేకోడూరు వైసిపి రాజకీయాలపై ... దృష్టి పెట్టండి జగన్ సార్!



రైల్వే కోడూరు రూరల్, జూన్ 2 ప్రభాతవార్త: రైల్వే కోడూరు వైసిపి రాజకీయాలు రాను రాను వర్గ విభేదాల మధ్య నడుస్తున్నాయని, దీనిపై రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో కోడూరు నాయకులు చర్చించినట్లు తెలిసింది. మంగళవారం రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డి కార్యాలయంలో ఆయనతో కలిసి చర్చించినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో రైల్వేకోడూరు వైసిపి పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు కొంతమందికి పిలుపే లేకుండా ఏకపక్ష రాజకీయాలు చేస్తున్నారని, దీనిపై జగన్మోహన్ రెడ్డి దృష్టి పెట్టి అందర్నీ వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిసింది.

## గంజాయి, మాదకద్రవ్యాలను తరిమి కొడదాం : డివైయస్‌పి




తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమని ఇక్కడకు నిత్యం భక్తులతో పాటు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని వారికి శాంతి యుత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని డివైయస్‌పి నరసింహామూర్తి తెలిపారు. మంగళవారం కజారియా ఆవరణలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా డివైయస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలతో పాటు ప్రశాంత వాతావరణం కల్పించుటకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించారని వాటి అమలుకు ప్రజలు పోలీసలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవగాహన కల్గితే ఏ పథకమైనా విజయవంతం అవుతుందని డివైయస్‌పి వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి ఆదేశాలతో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండలం తాటిపర్తి, రౌతు సూరమాల గ్రామాల సమీపంలోని పరిశ్రమల వద్ద డీఎస్పీ నర్సింహామూర్తి ఆధ్వర్యంలో సిఐ తిమ్మయ్య, ఎస్పై బాలకృష్ణ ప్రత్యేక డ్రగ్ అవగాహన, పరీక్షా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి డ్రగ్స్ నియంత్రణకు "ఈగల్ " పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారని డి.ఎస్.పి నరసింహామూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ స్మగ్లింగ్ విక్రయాలు ఆపడానికి ప్రత్యేక పోలీసు టీం ను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా దాడులు అరెస్టులు చేస్తున్నామని అదేవిధంగా బస్టాండ్ రైల్వే స్టేషన్ పాఠశాల దగ్గర నిఘా ఎక్కువ చేశామన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్న, వాడుతున్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వివరాలు సేకరించి ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు. పరీక్ష చేద్దాం మత్తును వదిలిద్దాం నినాదంతో ప్రత్యేక డ్రగ్ డిటెక్షన్ బస్సు, ఆధునిక గంజాయి గుర్తింపు కిట్ల సహాయంతో ప్రజలకు డ్రగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ పోలీస్ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొన్ని అంతర్గత బదిలీలను ఇఓ బికె వెంకటేశులు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారి చేసారు. వివిధ కారణాలు, సమీకరణలతో ఇఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎఇఓ ఐయన్‌వి మోహన్ ప్రోటోకాల్, వసతి విభాగం, స్టేషనరి, యంవి పారంలు, పబ్లికేషన్, స్కిట్ విభాగం, ట్రస్టుబోర్డు విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయన్ను లీగల్, లాండ్స్, గోశాల అన్నదానం, రాహుకేతు పూజా ప్యాకింగ్ విభాగానికి బదిలి చేసారు. ఆ విధులు నిర్వహిస్తున్న పి.లోకేష్‌బాబును, మోహన్ స్థానంకు బదిలి చేసారు. అలాగే దీర్ఘకాలంగా ప్రసాదాల పోటో, విభాగాన్ని పర్యవేక్షిస్తున్న యం.హరియాదవ్‌ను ఆలయ తనిఖీ దారునిగా బదిలి చేసారు. ఆ విధులు నిర్వహిస్తున్న యన్.సుదర్శనం నాయుడును ప్రసాదాల పోటు విభాగానికి బదిలి చేస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఆలయ ఇఓగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అంతర్గత బదిలిలు చేయటం ఇదే మొదటి సారి.

## ఆహార ప్రమాణాలను పాటించాలి

**-తిరుమలలో హోటళ్ళ యాజమాన్యంకు అదనపు ఈఓ చౌదరి నిర్ధేశం**




తిరుమల, జూన్ 2 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో ఉన్న వివిధ హోటళ్ళ యాజమాన్యం రుచిగా శుచిగా ఆహారపదార్థాలు అందించేందుకు ఉన్నత ఆహార ప్రమాణాలను పాటించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. భక్తుల ఆరోగ్యం, ఆహార భద్రతకు టిటిడి అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో మంగళవారం ఉదయం టిటిడి ఆరోగ్య శాఖ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ, నెస్లే ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రత, పరిశుభ్రతలపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. భక్తులకు నాణ్యమైన, సురక్షి తమైన ఆహారం అందించడం టిటిడి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న వారికి గ్లోవ్స్, ఆప్రాన్, సబ్బులు, టోపీలు తదితర వస్తువులు ఉండే కిట్లను ఉచితంగా అందజేశారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి. ఇక్కడ నిర్వహించే నిత్యాన్నదాన పథకం భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అంతేకాక ఈ పథకానికి ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను 80.జి ప్రకారం మినహాయింపు ఉండటంతో భక్తులు ముందుకు వస్తున్నారు. శ్రీకాళహస్తికి చెందిన ఎన్‌సుబ్రమణ్యం వారి తల్లి జ్ఞాపకార్థం నిత్యాన్నదాన పథకానికి రూ.1,16,116లు, శ్రీకాళహస్తికి చెందిన జి.హేమావతి నిత్యాన్నదాన పథకానికి రూ.20,116లు ఆలయ ఎఇఓ మోహన్ ద్వారా ఆలయానికి అందించారు. వారికి ఎఇఓ మోహన్ ఆలయంలోని అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## విరాళాల విభాగం ఏర్పాటుకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం 'డోనార్ సెల్‌ను' ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఇఓ బికె వవెంకటేశులు మంగళవారం వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు విరాళాలు ఇవ్వటానికి ఇబ్బంది పడుతున్నారని గుర్తించినట్లు తెలిపారు. దాంతో ఇక్కడ డోనార్ సెల్‌నే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దేవస్థానంకు విరాళాలు అందించే భక్తులు అనుకూలంగా వస్తు రూపేణ, నగదు రూపేణ విరాళాలు సమర్పించే వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డోనార్ సెల్ ఇన్‌చార్జిగా ఎం.నాగయ్యను నియమించినట్లు ఇఓ బికె వెంకటేశులు వివరించారు.

## మురళి కుటుంబానికి భరోసా



తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం బసవయ్య పాలెం నందు తెలుగుదేశం నాయకులు మురళి స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా ట్టంబేడు మండలం సీనియర్ నాయకులు తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు వారికుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళి కుటుంబానికి తాను అండగా ఉంటానని మురళి తమ మధ్య లేకపోవడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆయన ధాతృత్వాన్ని మరో సారి నిరూపించుకున్నారు. అధికారంలో ఉన్నపుడే కాదు అధికారం లేకున్నా తనకు ప్రజలకు ఉన్న అనుబంధం విడదీయరానిదని ఆయన చాటిచెప్పారు. శ్రీకాళహస్తి మండలం, పుల్లారెడ్డి కండ్రిగ హరిజనవాడకు చెందిన బైటేషన్, చెంగమ్మ ఆకస్మిక మృతి చెందారు. మంగళవారం వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అంతిమ సంస్కారాలకు ఒక్కొక్కరికి రు.10000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో గంగిరెడ్డి, పగలు రవీంద్రారెడ్డి, ఆక్స్ఫర్డ్ మధుసూదన్‌రెడ్డి, బాబు, శేఖర్ రెడ్డి, పగల సురేష్ రెడ్డి, జగ్గయ్య, భాస్కర్, నరసింహులు, నాదముని, కడివేటి రామచంద్రయ్య, నాదముని, చిరంజీవి, దేవా, శంకరయ్య తదితరులు ఉన్నారు.

## ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకువాలి



శ్రీకాళహస్తి జూన్ 2 ప్రభాతవార్త : ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నింటికీ జూన్ 12 వరకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాకీర్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల నేపథ్యంలో కొన్ని పాఠశాలలు, కళాశాలలు స్పెషల్ క్లాస్, బ్రిడ్జ్ కోర్స్ పేరుతో విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి యంత్రాల్లా చదివిస్తున్నారని విమర్శలు బాహటంగా ఉన్నాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులకే కాదు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కాన్వాస్ పేరుతో పనిచేయించడం దారుణమని పిడిసి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాకీర్ అన్నారు. ఈ సందర్భంగా జకీర్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు యాజమాన్యాలు ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న రేపటి నుండి పాఠశాలకు రావాలి అని విద్యార్థుల, వారి తల్లి, దండ్రులను ఒత్తిడి చేయడం నేరం అని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ జూన్ 12 వరకు వేసవి సెలవులు ప్రకటించారని అయినా యాజమాన్యం లెక్కచేయకుండా ఇష్ట రాజ్యాంగ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని కొండమెట్ట, అగ్రహారం ప్రాంతంలో జూన్ 3 నుంచి పాఠశాల పున ప్రారంభం చేస్తున్నట్లు వారి దృష్టికి వచ్చిందన్నారు. అసలే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ఉన్నారు. ఈ విషయమై ఎం ఈ ఓ కు విన్నవించగా తన దృష్టికి రాలేదని వస్తే చర్యలు తీసుకుంటానని ఆమె అన్నారని వివరించారు.

## నక్కల కాలువ వంతెన బాగు చేయండి : తలపా



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణం 29వ వార్డు నందుగల నక్కల కాలువ గురించి పాలకులుకానీ మున్సిపల్, ఆర్‌అడ్‌బి అధికారులు పట్టించుకోవటం లేదని కాంగ్రెస్ నాయకుడు దామోదరం ధ్వజమెత్తారు. గత సంవత్సరం నిర్మించినటువంటి మురుగు కాలువ కారణంగా నక్కల కాల్వ వంతెన వద్ద గత వర్షాకాలంలో పడిన వర్షాల కారణంగా మట్టి కోతకు గురై గత సంవత్సరం నవంబర్ నెల వంతెనకు గల రిటర్నింగ్ వాల్ పూర్తిగా దెబ్బతిన్న దన్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదన్నారు. నేడు వంతెన దెబ్బతిని కూలిపోయి స్థితికి చేరుకోవడంతో గడిచిన కొన్ని నెలలుగా పలు ప్రభుత్వ శాఖలకు కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నోసార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యం అని కాంగ్రెస్ సమన్వయకర్త తలప దామోదరం రెడ్డిఅన్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి పురపాలకశాఖ కమిషనర్‌కి తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించి త్వరితగతిన దెబ్బతిన్న వంతెన వద్ద నివారణ చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ మార్గం ద్వారా నిత్యం వేలాది మంది భక్తులు శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దర్శనానికి విచ్చేస్తూ ఉంటారని, కావున వెనువెంటనే వంతెనకు మరమ్మతులు చేసి వంతెనకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, ఏర్పేడు మండల నాయకులు మురళిరెడ్డి, జోసెఫ్, కృష్ణ సాయి, నాగరాజు, మహేష్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యపై పోరాటం



తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త: గిరిజనుల సమస్యపై నిత్యం పోరాటాలు కొనసాగిస్తున్నామని జనసేన నాయకులు పేట బ్రదర్స్ చంద్రశేఖర్ చిరంజీవిలు మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద కనపర్తి గ్రామ సచివాలయం సిబ్బంది తొట్టంబేడు మండలం పిల్లమేడు పంచాయతీ గిరిజన కాలనీలో మే నెల 17వ తారీఖున గిరిజనుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఆ సమస్యల్లో ప్రధానంగా అక్కడ వీధిలైట్ల సమస్య మా దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సమస్యను సంబంధిత సచివాలయంకు స్వయంగా పంచాయతీ కార్యదర్శికి దాదాపు నాలుగు సార్లు ఫోన్ చేసి మరి సమస్య విన్నవించగాకేవలం ఒక లైటు మాత్రమే వేసి మిగిలిన గాలికి వదిలేసారన్నారు. ఇప్పటికైనా దీనిపై ఉన్నత అధికారులు దృష్టి సారించాలని లేదంటే జనసేన ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

## అవకాశం ఉన్న చోట...శిక్షణకు అవకాశం కల్పించండి



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త: ఉపాధ్యాయులకు ఎక్కడ అవకాశం ఉందో అక్కడ శిక్షణకు అవకాశం కల్పించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ఇతర సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు జిల్లా విద్యా శాఖాధికారి కెవిఎన్ కుమార్, సమగ్రశిక్ష ఏపిసి భరత్ కుమార్‌రెడ్డి, ఎల్‌ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డిలను వేర్వేరుగా కలసి వినతి పత్రం అందించారు. ఈ నెల 4 నుంచి 9 వరకు జరగనున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కార్యక్రమాలను వేసవి మండుటెండల దృష్ట్యా ఉపాధ్యాయులకు అవకాశం ఉన్న శిక్షణా కేంద్రాల్లో పొందేందుకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు తిరుపతి జిల్లా ఎపిటిఎఫ్ అధ్యక్షుడు ఎస్ వెంకటముని, జిల్లా ప్రధానకార్యదర్శి బి.మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యాక్షుడు కే. వెంకటాద్రి, తిరుపతి రూరల్‌మండలం జిల్లా కార్యదర్శి హిమాచలం తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి జేసిబితో... ఉపాధి హామీ పనులు



తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం పనులపై అధికారుల పర్యవేక్షణ, పరిశీలన సన్నగిల్లింది. ఎక్కడ కూలీలతో పనులు జరుగుతున్నాయో ఎక్కడ యంత్రాలతో పనులు చేసి బిల్లులు తయారు చేసుకుంటున్నారో అంతుపట్టని పరిస్థితి తొట్టంబేడు మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం పూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు. కొంతమంది పలుకుబడి కలిగిన పెద్దలు కూలీల పేరుతో రాత్రి పూట జేసిబి సహాయంతో ఎంచక్కగా పనులు చేస్లి జేసిబితో గుంతలు తీసినచోట నిలబడి ఫోటోలు తీసుకుని కూలీలు పనులు చేసినట్టు రికార్డులు తయారు చేసి దర్జాగా బిల్లులు తీసుకుంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు తిలోధకాలు ఇస్తూరనే విమర్శలుఆరోపణలు వినబడుతున్నాయి. ఆ గ్రామంలో అన్నీ సామాజిక వర్గాల కూలీలు ఉండగా ఒకటి, రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు వారి పలుకుబడితో రాత్రి జేసీబీతో పనులు చేయించి పగటి పూట ఆ పనులు వద్ద కూలీలు కాని కూలీలు ఫోటోలు తీసుకుని మస్టర్‌లో నమోదు చేయిస్తున్నట్లు విమర్శలు వున్నాయి. ఉపాధి పనులు పర్యవేక్షంచ్చాల్సిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు చేసిన హాజరును బట్టి బిల్లులు చెల్లిస్తూ వున్నారని తెలిసింది. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నిజమైన కూలీలకు బిల్లులు చెల్లించాలని, పేదల ముసుగులో పెద్ద కూలీలలకు బిల్లులు చెల్లించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఏపీవో కళ్యాణిని వివరణ కోరగా సమాచారం అందిన వెంటనే బిల్లు పెట్టకుండా ఆపేసామన్నారు.